సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి

రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్

గోల్నాక, డిసెంబర్ 28 : అంబర్ పేట డివిజన్ బాపునగర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

కాచిగూడ, డిసెంబర్ 28 : కాచిగూడ డివిజన్‌లోని ఇందిరానగర్ బస్తీలో స్థానికులు కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను తెలుసుకున్న కార్పొరేటర్ ఉమాయాదవ్ జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్ శనివారం పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిష్కరింప జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని నీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను ఆమె కోరారు. రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బండారి దయానంద్‌కు సత్కారం

దయానంద్ యాదవ్‌ను అభినందిస్తున్న నందకిశోర్ యాదవ్, సురేశ్‌యాదవ్ తదితరులు

కాచిగూడ డిసెంబర్ 28: పేదలకు నిరంతరం సేవలందిస్తున్న ఎస్‌డీఎస్ఎమ్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్, విద్యావేత్త బండారి దయానంద్‌యాదవ్‌కు రతన్ టాటా ఎక్సలెంట్ అవార్డు దక్కిందని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. 1974 నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహించి, తన కంపెనీ ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన వ్యక్తి అని పేర్కొన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో దయానంద్ యాదవ్‌కు శనివారం రతన్ టాటా ఎక్సలెంట్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి చిట్టబోయిన నందకిశోర్‌యాదవ్, సురేశ్ యాదవ్ ఆయనను శాలువతో సత్కరించి అభినందించారు.

న్యూ నల్లకుంటలో కోతుల బెడద

న్యూనల్లకుంటలో ఇండ్ల గోడలపైన సంచరిస్తున్న కోతులు

- ఇంట్లోకి చొరబడి వస్తువుల అస్తవ్యస్తం
- మీదపడి కొరుకుతున్న వైనం
- భయం గుప్పిట్లో స్థానికులు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

అంబర్‌పేట, డిసెంబర్ 28 : అభయారణ్యాలు అంతరించిపోతుంటే అక్కడి జంతువులు జనారణ్యంలోకి వస్తున్నాయి. ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నల్లకుంట డివిజన్ పరిధిలోని న్యూ నల్లకుంటలో కోతులు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వంటగది తలుపులు, కిటికీలు తెరిచి ఉంటే చాలు ఇండ్లలోకి చొరబడి వస్తువులు ఎతుకుపోతున్నాయి. అంతేగాక ఎగబడి కరుస్తున్నాయి. రోజు ఒక్కరైనా ఈ కోతుల దాడిలో గాయపడి దవాఖాన పాలవుతున్నారు. నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంట, మదర్‌డైరీ, న్యూరామాలయం, నరేంద్ర పార్కు, టీఆర్టీ కాలనీ తదితర ప్రాంతాలలో గుబురుగా మొక్కలు, పెద్ద చెట్లు ఉన్నాయి. దీంతో కోతులు కొంత కాలంగా ఇక్కడ తమ విన్యాసాలతో ప్రజలకు ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. ఆయా కాలనీలలో ఉన్న చెట్టు కొమ్ము తమ అపార్ట్‌మెంట్లకు దగ్గర ఉండటంతో వాటి ఆధారంగా కోతులు తమ ఇండ్లలోకి ప్రవేశించి విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా.. కోతులను నియంత్రించేందుకు ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న జీహెచ్ఎంసీ తన బాధ్యత నుంచి క్రమంగా తప్పుకుంటున్న భావన కలుగుతోంది. రోజులో బల్దియాకు వచ్చే ఫిర్యాదుల్లో కచ్చితంగా కోతుల బెడదకు సంబంధించినవి ఉంటున్నాయి. 'అదిగో కొండముచ్చులను తెప్పిస్తున్నామని' చెప్పడం తప్పించి ఆచరణలో ఏ ఒక్కటి చేసి చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు కోతుల వల్ల ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది.

కోతులను పట్టుకోవడంలో నిర్లక్ష్యం..
గడిచిన రెండు, మూడు నెలల వ్యవధిలో కోతులను పట్టుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. అదేమంటే 'మా సిబ్బందిని చూస్తూనే అవి పారిపోతున్నాయని అధికారులు అంటున్నారు. పిల్లల చేతుల్లో ఉన్న వస్తువులను పట్టుకుపోవడం కోసం కోతులు మరీ క్రుతిమించి ప్రవర్తిస్తున్నాయని ఎక్కడ గాయపరుస్తాయోనన్న భయాందోళనలతో తల్లిదండ్రులున్నారు. కనీసం వారంలో ఒకరోజు ప్రత్యేకంగా ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని కోతులను పట్టుకోవడమో..మరో చోటుకు తరిమివేయడమో చేస్తేనే గాని తమ సమస్య పరిష్కారం కాదని ప్రజలు తెలిపారు.

కార్మికుల పక్షపాతి పీజేఆర్

జనార్దన్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఠాకూర్ అమర్‌సింగ్, జె. రవీందర్ తదితరులు

అబిడ్స్, డిసెంబర్ 28 : కార్మికుల పక్షపాతి పి. జనార్దన్‌రెడ్డి అని కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఠాకూర్ అమర్‌సింగ్ కొనియాడారు. పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గుడిమల్కాపూర్ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి నాయకులు జె. రవీందర్ తదితరులతో కలిసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రిగా పి. జనార్దన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి పాటు పడ్డారని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానున్నానని అందుబాటులో ఉండి వారి కష్టాలు తీర్చిన మహా నాయకుడు పీజేఆర్ అని అన్నారు. నాయకులు ఆయన ఆశయ సాధనకు పాటు పడాలని కోరారు. నాయకులు జె. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌రావుకు అవార్డు

విజయ్‌రావుకు అవార్డ్‌ను అందజేస్తున్న ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ ఆర్‌వీ అశోకన్

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 28: మెడిసిన్ అండ్ సైన్స్ ఆఫ్ మెడిసిన్ ప్రాక్టీస్‌లో అంకిత భావానికి గుర్తింపుగా ఐఎంఏ రాష్ట్ర శాఖ కార్యదర్శి డాక్టర్ విజయ్‌రావు జక్కులకు ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్‌వీ అశోకన్ ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్స్ అప్రిసియేషన్ అవార్డ్‌ను అందించి సత్కరించారు. ఈ మేరకు శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సిటీ బ్రాంచి ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ 99వ ఆల్ ఇండియా మెడికల్ కాన్ఫరెన్స్ ఉత్సవ్ నాట్కన్–2024 నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డును అందుకున్న విజయ్‌రావు మాట్లాడుతూ.. ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్‌వీ అశోకన్, డాక్టర్ శరత్ కుమార్ అగ్రవాల్, ఐఎంఏ హెడ్ క్వార్టర్స్ సెక్రటరీ జనరల్ డాక్టర్ దిలీప్ భానుశాలి, డాక్టర్ అనిల్ జే నాయక్‌లు సెలెక్ట్ చేసి అవార్డును ప్రదానం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

కుల్సుంపురాలో ముగ్గురు దోపిడీ దొంగల అరెస్టు

- ఒక దేశీయ పిస్టల్, రెండు బుల్లెట్లు, రెండు కత్తులు, ఒక నకుల్ పంచ్, 11 మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం

ఏ1గా ఉన్న సయ్యద్ అబ్దుల్ హసన్ హైద్రాబాద్, సైబారాబాద్ పరిధిలోని 17 పోలీస్ స్టేషన్‌లలో నిందితుడు.
ఏ2గా ఉన్న సయ్యద్ తాలిబ్ అలీ నగరంలోని 7 పోలీస్ స్టేషన్‌లలో నిందితుడు.
ఓ హత్యా యత్నం కేసులో వాంటెడ్ లిస్టులో ఈ ముగ్గురు ఉన్నట్లు తెలిపిన డీసీపీ

వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రశేఖర్‌తో ఏసీపీ మహ్మద్ మునావర్, ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్

కార్వాన్, డిసెంబర్ 28: హైదరాబాద్, సైబారాబాద్ పరిధులలో ఇండ్లలో చోరీలతో పాటు దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు పాత నేరస్తులను కుల్సుంపురా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విషయమై సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ జి. చంద్రమోహన్ కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మహ్మద్ మునావర్, ఇన్‌స్పెక్టర్ కె. సునీల్ కుమార్‌లతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 24న సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన క్రిష్ణ అనే వ్యక్తి జియాగుడాలోని రోడ్డులో తన ద్విచక్రవాహనంపై కార్వాన్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో 100 ఫీట్ల రోడ్డులో ముగ్గురు వ్యక్తులు క్రిష్ణను ఆపి కత్తులు చూపి అతని ద్విచక్రవాహనాన్ని, మొబైల్ ఫోన్‌ను లాక్కోవడంతో పాటు ఎవరికైనా చెబితే చంపేస్తామని చెప్పి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితుడు కుల్సుంపురా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పాత నేరస్తులైన చింతల్‌మెట్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్ హసన్(32), సైఫ్ అలీ మిర్జా(19) యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ తాలిబ్ అలీ(23)లను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఓ హీరో హోండా గ్లామర్(టీఎస్–13ఈఎన్–9614), మరో పల్సర్(టీఎస్12–ఈవి–2605) ద్విచక్రవాహనాలను, దేశీయ పిస్టల్, రెండు బుల్లెట్లు, రెండు కత్తులు, నకుల్ పంచ్, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఏ1గా ఉన్న సయ్యద్ అబ్దుల్ హసన్ హైద్రాబాద్, సైబారాబాద్ పరిధిలోని 17 పోలీస్ స్టేషన్‌లలో నిందితుడిగా ఉన్నాడు. ఏ2గా ఉన్న సయ్యద్ తాలిబ్ అలీ నగరంలోని 7 పోలీస్ స్టేషన్‌లలో నిందితుడిగా ఉన్నాడు. అత్తాపూర్ పీఎస్ పరిధిలో ఓ హత్యా యత్నం కేసులో, లంగర్‌హౌస్‌లో ఓ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించిన కేసులో ఈ ముగ్గురు వాంటెడ్ లిస్టులో ఉన్నట్లు డీసీపీ తెలిపారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముజీబ్ హుస్సేనీ

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 28 : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అనుక్షణం దేశం కోసం పరితపించిన దేశ భక్తుడని డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. శనివారం మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి ఆయన హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు విక్రమ్‌కుమార్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, సభ్యులు ఖాలేద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, శ్రీధర్ నాయుడు, ముఖీం ఖురేషి, కేంద్ర సంఘం సభ్యులు శంకర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ సభ్యులు కృష్ణ, గ్రంథాలయ సభ్యులు అయోధ్య, వరప్రసాద్, మహేందర్, సుఖేష్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ సభ్యులు నజీర్, జిల్లా శాఖ పీఆర్‌వో జహంగీర్, ఏపీఆర్‌వో మహ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

అబిడ్స్: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. మంగళ్‌హాట్‌లో జరిగిన కార్యక్రమంలో మంగళ్‌హాట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్ మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నరేశ్‌సింగ్, శశిరాజ్‌సింగ్, సంతోష్‌సింగ్, రాకేశ్ సింగ్, రాబర్ట్, ధర్మేష్‌సింగ్, గులాబ్, శంకరమ్మ, అనితాబాయి, పి. శాంత తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోండి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

మెహిదీపట్నం, డిసెంబర్ 28 : ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం సాయంత్రం గోల్కొండ సెవన్‌టూంబ్స్ చౌరస్తాలో జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. సెవన్ టూంబ్స్ చౌరస్తాలో నిర్మిస్తున్న ఐలాండ్ ఎత్తును తగ్గించాలని ఎమ్మెల్యేకు ఇన్‌స్పెక్టర్ వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మైనార్టీల విద్యాభివృద్ధికి కృషి

మైనార్టీల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ బుక్‌లను ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒవైసీ విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి, చార్మినార్ ఎమ్మెల్యేలు మాజీద్ హుస్సేన్, మీర్ జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ అఫెండి తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 28

వృద్ధులకు అండగా ఉంటాం

వృద్ధులకు అండగా ఉంటామని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం నాంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు వృద్ధులు ఎమ్మెల్యే ను కలిసి పెన్షన్లను ఇప్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పెన్షన్లను ఇప్పిస్తాని పేర్కొన్నారు. – మెహిదీపట్నం

ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలో వాయిదా పడిన ఎంఫార్మసీ పరీక్షల తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందిన నేపథ్యంలో ఈనెల 27న రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఆ రోజు జరగాల్సిన అన్ని పరీక్షలను తిరిగి ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష సమయం, పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

కాచిగూడ, డిసెంబర్ 28: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(35)శనివారం ఉందానగర్–జూకల్ రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. నీలి రంగు ప్యాంట్, కాకి రంగు చొక్కా ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాల కోసం 8712568495లో సంప్రదించాలని కోరారు.

డబీర్‌పుర రైల్వేస్టేషన్‌లో....
రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (85)శనివారం డబీర్‌పుర రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–1లో అనారోగ్యంతో ఉంటూ మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఆకుపచ్చ రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాల కోసం 8712568495లో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థ ముసుగులో.. మోసం చేశారు

- బహుజన సమాజ్ పార్టీ రాష్ట కార్యాలయం ఎదుట బైఠాయించిన సొంతపార్టీ కార్యకర్తలు

బీఎస్‌పీ రాష్ట్ర కార్యాలయం ఎదుట బైఠాయించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 28: స్వచ్ఛంద సంస్థ ముసుగులో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ పేద ప్రజలతో పాటు స్వంత పార్టీ కార్యకర్తలను మోసం చేశారని పలువురు బాధితులు ఆరోపించారు. శనివారం ఏసీ గార్డ్స్‌లోని బీఎస్‌పీ రాష్ట్ర శాఖ కార్యాలయం ఎదుట పలువురు బాధితులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు పల్లేటి రవీందర్, గుర్రాల నాగయ్య, ముడిగి భిక్షపతి, నాథూరాం, గ్యార జంగయ్య, పూదరి నర్సింహ, జిల్లా రవి, వంగ కృష్ణయ్య, అజ్జాలపురం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ పేదలను, సొంత పార్టీ కార్యకర్తల వద్ద కోట్లాదిరూపాయలను దోచుకొన్న బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, మాల్యాని కరుణోదయ సొసైటీ యజమాని కొండ కృష్ణమ్మలపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బీఎస్‌పీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించడం జరిగిందని అన్నారు. గ్రామాలలో ఇండ్లు కట్టిస్తానని, నాబార్డు నుంచి వివిధ పథకాల సబ్సిడీతో పాటు డైరీ, వ్యవసాయ, చేపల పెంపకం వంటి రుణాలు ఇప్పిస్తానని మార్జిన్ మనీ, ఖర్చుల పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ. రూ.50 వేల నుంచి రెండు లక్షల వరకు వసూలు చేసి మోసం చేసిన మంద ప్రభాకర్, కొండ కృష్ణమ్మలపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పోలీసులకు, ప్రభుత్వాన్ని బాధితులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఇండ్లు, రైతులకు డైరీ ఫాంలు, చేపల చెరువుల ఏర్పాటుకు రుణాలు ఇప్పిస్తానని మాల్యానీ కరుణోదయ సొసైటీ పేరుతో కోట్లాది రూపాయలను మంద ప్రభాకర్, కొండ కృష్ణమ్మలు కలిసి వసూలు చేశారని మండిపడ్డారు. మంద ప్రభాకర్ ఒక్క మునుగోడు నియోజకవర్గంలోను రూ. 42 లక్షలను ఇండ్లు కట్టిస్తామని పేదల నుంచి తీసుకున్నారని బాధితుడు పల్లేటి రవీందర్ వాపోయారు. గట్టిగా అడిగితే ఖతం చేస్తా అంటూ బెదిరిస్తున్నారని అన్నారు. బీఎస్‌పీ జాతీయ నాయకత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి మంద ప్రభాకర్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు తగిన న్యాయం చేసి డబ్బులను తిరిగి ఇప్పించాలని బాధితులు కోరారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు పెన్షన్లు ఉండకూడదని పాదయాత్ర

పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు గుమ్మడి నర్సయ్య, జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, ఎల్వీ సుబ్రహ్మణ్యం

రవీంద్రభారతి, డిసెంబర్ 28 : నేటి రాజకీయ నాయకులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. బైదిపీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేక్ అప్ డెమొక్రసీ మూమెంట్ పేరిట హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాజీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, ఏపీ మాజీ చీఫ్ సెక్రటరి ఎల్వీ సుబ్రహ్మణ్యం, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ ఆవిష్కరించారు. ఈ పాదయాత్రను బైది పీపుల్ ఫౌండేషన్ ఫౌండర్ గణేశ్ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు డిమాండ్లతో ప్రజాస్వామ్యానికి అవసరమైన సంస్కరణలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలని గణేశ్ ప్రారంభించనున్న పాదయాత్రకు మద్దతు తెలుపాలన్నారు. ఒక రాజకీయ నాయకుడికి ఒక్క పెన్షన్ మాత్రమే ఉండాలని.. ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు పెన్షన్లు ఉండకూడదని పాదయాత్ర చేయడం చాల మంచి నిర్ణయమన్నారు. అలాగే ఒక అభ్యర్థి ఒక్క నియోజకవర్గం నుంచి మాత్రమే ఎలక్షన్లలో పోటీచేయాలని అన్నారు. రెండు చోట్లు పోటీ చేయడం వల్ల మళ్లీ ఒక చోట ఎన్నికలు రావడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందని అన్నారు. ఒక పదవిలో రాజకీయ నాయకుడు మరొక స్థానానికి పోటీ చేయకూడదని.. పై డిమాండ్లతో హైదరాబాద్ నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరొక పార్టీలోకి వెలితే .. ఆ పదవికి రాజీనామా చేసి మరోపార్టీలో చేరే విధంగా చట్టాన్ని సవరించాలని అన్నారు.

మంచినీటి, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు

ప్రజలకు మంచినీటి, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రజలకు మంచినీటి, డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 28

వ్యక్తి అదృశ్యం

సంతోష్‌కుమార్‌పాల్

కాచిగూడ,డిసెంబర్ 28: వ్యక్తి అదృశ్యమైన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన సంతోష్‌కుమార్‌పాల్(42) హైదరాబాద్‌ను చూడడానికి స్నేహితులతో కలిసి లింగంపల్లిలోని సాయి పరివార్ హోటల్‌లో దిగాడు. శనివారం తెల్లవారు జమున టూత్‌పేస్ట్ తీసుకువస్తానని చెప్పి హోటల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కలత చెందిన స్నేహితులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హోటల్ నుంచి వెళ్లే సమయంలో ఆకుపచ్చ రంగు చొక్కా, నీలి రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ సర్కిల్ –13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ

మెహిదీపట్నం, డిసెంబర్28 : ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జీహెచ్ఎంసీ సర్కిల్ –13(కార్వాన్)డిప్యూటీ కమిషనర్ శశిరేఖ అన్నారు. శనివారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో విద్యుత్, జలమండలి, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, యూసీడీ, పారిశుధ్య విభాగాల అధికారులతో శశిరేఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలసమస్యలపై దీర్ఘంగా చర్చించారు. అంతే కాకుండా కార్వాన్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఆకట్టుకున్న భూతకాలం నాటకం

నాటకంలో రంగస్థల నటులు

రవీంద్రభారతి, డిసెంబర్ 28: రసరంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గోవాడ క్రియేషన్ వారు సమర్పించు భూతకాలం నాటకం రవీంద్రభారతిలో నిర్వహించారు. భూతకాలం నాటకానికి రచన దివాకరబాబు, డా. వెంకట్‌గోవాడ దర్శకత్వం వహించిన ఈ నాటకం వీక్షకులను ఎంతగానో ఆకర్షించింది. ఈ నాటకం యొక్క సారాంశం.. ఎలకు దేవుడి కోసం తపస్సు చేసి ఏనుగంత బలం కావాలని కోరినా దేవుడు వరం ఇవ్వడు.. అలాగే ఏనుగు తపస్సు చేసి నాకు రెక్కలు కావాలి.. నేను ఎగరాలి అంటే ఇవ్వడు. అదే చేస్తే ఎంత అనర్థం అవుతుందో దేవుడికి తెలుసు. మనకు ఏదీ ఇవ్వాలో భగవంతుడికి తెలుసు. అందుకే మనం నాకది కావాలి... నాకిది కావాలి అని మనం ఎన్ని పూజలు చేసినా భగవంతుడు ఇవ్వడు. జీవితాన్ని జీవించాలనుకునే వాడు భూతకాలాన్ని పీడకలలా బావించి విస్మరించాలి. వర్తమానంలో కలలు కనాలి. శ్రమించాలి. భవిష్యత్‌ను భగవంతుడు నిర్ణయిస్తారు.ఈ కార్యక్రమంలో రసరంజని సభ్యులు సేనాపతి, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.